ఘనంగా జాతీయ సైన్స్‌డే సంబరాలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సావిత్రి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామన్ జీవిత చరిత్రను, ఆయన ప్రపంచానికి చేసిన సేవలు కొనియాడారు. 1929లో బ్రిటిష్ ప్రభుత్వంతో అరుదైన నైట్ హుడ్ బిరుదును, 1930లో రామన్ ఎఫెక్టుకు నోబెల్ బహుమతి, 1954లో భారతదేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నతో గౌరవించబడ్డారని కొనియాడారు. విద్యార్థులను ఉద్దేశించి సైన్స్‌తో అద్భుతాలు సృష్టించాలని సూచించారు. ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసాచార్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): దేశంలో ప్రతి సంవత్సరం సైన్స్‌డేను ఫిబ్రవరి 28న జరుపుకోవటానికి సర్ సీవీ రామన్ చేసిన పరిశోధన ఫలితమేనని తహసీల్దార్ శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. నేషనల్ సైన్స్ డేను తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబరు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ దర్శి ఏరియా కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన చంద్రశేఖర వెంకట రామన్ భౌతిక శాస్త్రంలో పేరుగడించారని పేర్కొన్నారు. సీవీ రామన్‌కు 1930 డిసెంబర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి వరించిందని ఐఆర్‌సీఎస్ ఎగ్జిక్యూటివ్ మెంబరు కపురం శ్రీనివసారెడ్డి తెలిపారు. 1954లో భారత ప్రభుత్వం ఆయన్ను భారతరత్న పురస్కారంతో సత్కరించిందని, లెనిన్ శాంతి బహుమతి కూడా వెంకటరామన్ అందుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు సీవీ రామన్ ఆదర్శప్రాయుడని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆర్ఐ పరిటాల శ్రీనివాసులు, వీఆర్వోలు మురళి, సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల, రెయిన్‌బో హైస్కూల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి.ప్రదీప్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెయిన్‌బో హైస్కూల్లో విద్యార్థులు తమ మేధస్సుతో తయారు చేసిన రెయిన్ హార్వెస్ట్, ఫార్మసీ స్టాల్, ఫ్యాక్టరీ పొల్యూషన్ కంట్రోల్, కిడ్నీ ఫంక్షనింగ్ ప్రాజెక్టులను ఎంపీపీ పరిశీలించి వారిని అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో హైస్కూల్ ప్రిన్సిపాల్ నిఖిల కిరణ్, కళాశాలలో లెక్చరర్లు జి.పుష్పరాజు, ఆర్.గోపి, పి.ఝాన్సీ పాల్గొన్నారు.


వై.పాలెం: సైన్స్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ కిరణ్‌గౌడ్


దర్శి: సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్



పెద్దదోర్నాల: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సావిత్రి

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం

కురిచేడు: స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల (ఉర్దూ) ఎస్‌జీటీగా పనిచేస్తున్న నిమ్మగడ్డ సంధ్యారాణి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సిబ్బంది ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు ముఖ్య అతిథులుగా ఎంఈఓ వస్త్రాంనాయక్, ఎంపీడీఓ సతీష్‌బాబులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమన్నారు. బాధ్యతలు ఒడిదొడుకులు లేకుండా నిర్వహించి పదవీ విరమణ చేయటం అదృష్టమన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించి ఎటువంటి ఒడిదొడుకులకు లోనుకాకుండా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం సంధ్యారాణిని ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.బాలనాయక్, షేక్ ఖాజా రహంతుల్లా, జిల్లా కార్యదర్శి శివరామకృష్ణ, యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌వలి, సీనియర్ ఉపాధ్యాయులు పచ్చా పూర్ణచంద్రరావు, షేక్ మహబూబ్‌బాషా, వీవీ రమణారావు, జె.రామయ్యలు సన్మానించారు. అనంతరం పాఠశాల సిబ్బంది పి.వెంకటేశ్వర్లు, ఆర్.రామసుబ్బారావు, డి.అశ్వని, శాంతకుమారి, కె.ఆదెమ్మ, విద్యాకమిటీ ఛైర్మన్ షేక్ కాశింబీలు ఘనంగా సన్మానించారు.

దర్శి (కురిచేడు): ఉద్యోగ బాధ్యతలు సంతృప్తినివ్వాలని ప్రధానోపాధ్యాయురాలు ఎస్.కిరణ్‌కుమారి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రికార్డు అసిస్టెంట్ షేక్ నజీర్ బాషా ఉద్యోగ విరమణ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడారు. కిరణ్‌కుమారి అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సభకు ముఖ్యఅతిథులుగా ఎస్ఎంసీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్లు, సర్పంచ్ బొట్టు రామారావు, ఎంపీటీసీ ఐ.సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ గొర్రె సుబ్బారెడ్డి, రాజంపల్లి, దర్శి బాలికోన్నత పాఠశాల, పోతవరం, చందలూరు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు జి. చంద్రమోహన్, ఎస్కే ఖాదర్ మస్తాన్, ఎన్.వెంకటేశ్వర్లు, జి.గురుప్రసాద్ హాజరయ్యారు. అనంతరం నజీర్‌బాషా దంపతులను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. పాఠశాలకు ప్రింటర్‌ను రూ.40 వేలతో అందజేసినట్లు నజీర్‌బాషా తెలిపారు. చిన నాగిరెడ్డి, కొండవీటి వెంకట నారాయణ, జనార్దన్‌రెడ్డి, తిరుపతిరావు, రెడ్డి నాయక్, గమనయేల్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, మాలకొండయ్య, రంగయ్య, సీతామహాలక్ష్మి, జీనత్‌బేగం పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయంపై కేసు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని మక్కెనవారిపాలెంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వెంకటేశ్వర్లు నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు దర్శి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. దాడుల్లో ఎస్సై రఘుసత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి సురేష్ ప్రత్యేక పూజలు


స్వామి ఆశీస్సులు పొందుతున్న మాజీ మంత్రి సురేష్

త్రిపురాంతకం: స్థానిక త్రిపురాంతకేశ్వర స్వామిని శుక్రవారం మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ దర్శించుకున్నారు. ఈ మేరకు ఉభయ దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆయనకు ఆలయ కమిటీ ఛైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు, మాజీ ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలిరెడ్డి శాలువలు కప్పి స్వాగతం పలికారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

కురిచేడు: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం జ్ఞాన ప్రసూనాంబదేవికి చండీ హోమం, శ్రీకాళహస్తీశ్వరునికి అభిషేకం నిర్వహించారు. 51 జంటలు కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నిర్వహించాయి. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు, ఎర్ర శేషయ్యలు వారితో పూజలు చేయించారు. అమావాస్య తిది కావడంతో పాటు మహాశివరాత్రి పర్వదినం తర్వాత వచ్చే అమావాస్య కావడంతో పూజలకు విశేషం లభించింది. అంతే కాకుండా అభిషేక ప్రియుని ఆశీస్సులు, అమ్మవారి దీవెనల కోసం చండీ హోమం నిర్వహించారు. చండీ హోమం చేస్తే సకల దరిద్రాలు పోతాయనేది శాస్త్రం చెబుతోంది. సైన్సు ప్రకారం హోమంలో వేసే మూలికల ధూపంతో పర్యావరణంలోని అనేక రకాల సూక్ష్మక్రిములు నశించి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయనే విషయం తేటతెల్లమవుతోంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

నేటి నుంచి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

తాళ్లూరు: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద శనివారం నుంచి అన్ని గ్రామాల్లోని పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు పశువైద్యులు ప్రతాప్‌రెడ్డి, రాంబాబు తెలిపారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకా, 48 నెలలు వయసు కలిగిన పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకా అందించనున్నట్లు తెలిపారు. మార్చి ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు 30 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తాళ్లూరు పశువైద్యశాల డాక్టర్ ప్రతాప్ రెడ్డి 8 మందితో, తూర్పు గంగవరం పశువైద్యశాల డాక్టర్ రాంబాబు ఆరుగురితో టీకా కార్యక్రమం అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు.

చెత్తను వేరు చేసి షెడ్‌కు తరలించాలి

● డీఎల్‌పీఓ పద్మ


షెడ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పద్మ

ముండ్లమూరు (కురిచేడు): రోడ్ల వెంట చెత్త వేయరాదని, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు తరలించాలని డీఎల్‌పీఓ ఆర్.పద్మ ఆదేశించారు. మండలంలోని పూరిమెట్ల పంచాయతీని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షెడ్ వద్దకు తరలించిన చెత్తను వర్మికంపోస్టు తయారు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీలోని రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీడీఓ జనార్దన్, పూరిమెట్ల సర్పంచ్ రామాంజి, కార్యదర్శి వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే


పతాకావిష్కరణ అనంతరం టైలర్లు

కురిచేడు: టైలర్స్ డే సందర్భంగా స్థానిక టైలర్లు బస్టాండ్ సెంటరులో శుక్రవారం పతాకావిష్కరణ చేశారు. కుట్టుమిషన్‌తో ఎన్నో కుటుంబాలకు జీవనం లభించిందని టైలర్ షేక్ మీరావలి పేర్కొన్నారు. నేడు ఆధునిక పరికరాలు, పోకడలు ఎన్ని వచ్చినా కుట్టుమిషన్‌కు ఉన్న ప్రాముఖ్యత దానికి ఉందని టైలర్ చాంద్‌బాషా పేర్కొన్నారు. టైలర్లు సంఘటితంగా ఉండి తమ వృత్తితో పాటు కుటుంబాలను పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. తమ వృత్తి నైపుణ్యాలను వెలికి తీసి ప్రజలను ఆకర్షితులను చేసి తమ జీవనాన్ని కొనసాగిస్తున్నామని టైలర్ మహ్మద్ తెలిపారు. టైలర్ల సంఘ అధ్యక్షుడు దానం, ఉపాధ్యక్షుడు హుస్సేన్, కోశాధికారి శ్రీను, పీవీ చెన్నయ్య, అంజి, పిల్లావలి, వలి, బాండు, నాగూర్, బ్రహ్మం పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌ను పరిశీలించిన డీఈఓ

ముండ్లమూరు (కురిచేడు): స్థానిక మోడల్ స్కూల్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్ పరిశీలించారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా ఆయన విద్యార్థులు చేసిన పరికరాలను చూసి వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సైన్స్ విద్యార్థులకు ఉపయోగపడేలా ఉపాధ్యాయులు తమ బోధన అర్థమయ్యేలా చూడాలని కోరారు. అదే విధంగా సీవీ రామన్ జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. సైన్స్ ఉపాధ్యాయులు చాంద్‌బాషా, జానకిరామయ్య, ఎంజెలినాగ్రేస్, అనూరాధ, ఉపాధ్యాయులు సుబ్బారావు, యెమలేశ్వరచారి, సాధు వెంకటేశ్వరరెడ్డి, హరిబాబు, ప్రిన్సిపాల్ కల్లూరి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

రమణీయంగా కాశీవిశ్వేశ్వరుని రథోత్సవం

దర్శి (కురిచేడు): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ అన్నపూర్ణాసమేత శ్రీ కాశీవిశ్వేశ్వరుని రథోత్సవం రమణీయంగా సాగింది. ఆలయం నుంచి ప్రధాన రోడ్డులో రథోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనంద పరవశులయ్యారు. యువత వేసిన నృత్యాలు, వెలమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళల కోలాట ప్రదర్శనలు, క్రాప్ యువ మహిళల వేషధారణలు ఆకట్టుకున్నాయి. శివసాయి నాట్య మండలి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకర్షించాయి. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన రథోత్సవం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేశారు. కొందరు భక్తులు తాగునీరు, మజ్జిగ ఏర్పాటు చేశారు.


అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరుడు


యువతుల నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న భక్తులు